సాక్షి మహబూబ్‌నగర్
సోమవారం । 10 । జూలై । 2023



ముందు చూపేది?
జడ్చర్ల మున్సిపాలిటీలో పలు కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయి.
వివరాలు 8లో ▸



కాగితాల్లోనే మినీ డిపో
జడ్చర్లలో ఆర్టీసీ మినీ బస్‌డిపో ఏర్పాటు ఏళ్ల తరబడిగా ప్రతిపాదనలకే పరిమితమైంది.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /22.5

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రియాంకాగాంధీ సభా ఏర్పాట్లపై సమావేశం



స్టేషన్ మహబూబ్‌నగర్: కొల్లాపూర్‌లో ఈ నెల 20న ఏఐసీసీ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ పాల్గొనే బహిరంగ సభా ఏర్పాట్లపై చర్చించడానికి ఆదివారం రాత్రి హైదరాబాద్ మోయినాబాద్ దగ్గరలోని ఓ ఫాంహౌజ్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. ప్రియాంకాగాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కొడంగల్, మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యేలు గురునాథ్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, గద్వాల జెడ్పీచైర్ పర్సన్ సరిత భర్త తిరుపతయ్యలతో నాయకులు సభా ఏర్పాట్లపై చర్చించినట్లు సమాచారం. ప్రధానంగా జనసమీకరణపై చర్చించినట్లు తెలుస్తోంది. సభను భారీస్థాయిలో నిర్వహిద్దామని తీర్మానించారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట డీసీసీ అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, ప్రభాకర్‌రెడ్డి, వంశీకృష్ణ, నారాయణపేట మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ కట్టడికి ప్రత్యేక చర్యలు

పాలమూరు: జిల్లాలో డెంగీ వ్యాధి ప్రబలకుండా ప్రత్యేక నివారణ చర్యలతోపాటు అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించడం జరుగుతుందని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని జమిస్తాపూర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన మందులతోపాటు టానిక్‌లను గ్రామస్తులకు అందజేశారు. అనంతరం గ్రామంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారితో పాటు ఇతర సిబ్బంది ఇంటింటికి తిరిగి నిల్వ ఉన్న నీటిని పారబోసి సంపులలో రసాయనాలు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వర్షాలు పడిన తర్వాత దోమలు వ్యాప్తి పెరుగుతుందని ఈ క్రమంలో ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా రాత్రివేళలో దోమ తెరలు వాడాలని, ఇళ్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, జిల్లా మలేరియా అధికారి శ్వేతారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

12న పాఠశాలలు, కళాశాలల బంద్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న జిల్లావ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలు బంద్ పాటిస్తున్నట్లు పలు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచి చాలారోజులు అవుతున్న ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయలేదని ఆరోపించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడం లేదని, నాణ్యత లేని సరుకులు వాడుతుండటంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు లక్ష్మణ్, మారుతి, నందు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. విభాగ్ ప్రముఖ్ కర్త రామచందర్ మాట్లాడుతూ ఏబీవీపీ ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా 35 లక్షల మంది కార్యకర్తలు ఉన్న విద్యార్థి సంఘంగా ఏబీవీపీ నిలిచిందని, దేశ సమగ్రత లక్ష్యంగా పనిచేస్తూ వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతి పునర్నిర్మాణం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, శేఖర్, మహేష్, శివ, అభినయ్ తదితరులు పాల్గొన్నారు. పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణు మాట్లాడుతూ ఏబీవీపీ ప్రారంభం నాటి నుంచి విద్యార్థుల సమస్యల పరిష్కారం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకు లు అర్జున్, శోభన్, ప్రవీణ్, శరత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అ'గౌరవ'మేల..!

బీఆర్‌ఎస్ అసంతృప్తుల్లో అంతర్మథనం

- పలుచోట్ల స్థానిక ఎమ్మెల్యేలతో ముదిరిన వైరం
- సీనియార్టీ గుర్తింపు లేక అధిష్టానంపై పలువురి గుర్రు
- ప్రత్యామ్నాయ మార్గాలపై ఆయా నేతల దృష్టి
- పాలమూరులో మారుతున్న రాజకీయ సమీకరణాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీలో అసంతృప్త సెగలు భగ్గుమంటున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలతో వైరం కారణంగా కొందరు 'గులాబీ'ని వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరించిన తర్వాత మాజీమంత్రి జూపల్లి కాంగ్రెస్‌లో చేరుతుండగా.. వనపర్తి జిల్లాకు చెందిన అసమ్మతి నేతలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి తదితరులు అదే బాట పట్టిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డి ఇది వరకే హస్తం గూటికి చేరగా.. తాజాగా దామోదర్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా చేయి అందుకోనున్నట్లు స్పష్టమైంది. అంతేకాకుండా బీఆర్‌ఎస్‌లో సీనియారిటీతోపాటు సిన్సియారిటీని అధిష్టానం గుర్తించడం లేదని గుర్రుగా ఉన్న మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇలా రోజురోజుకు మారుతున్న రాజకీయ పరిణామాలు పాలమూరును హీటెక్కిస్తున్నాయి.

సొంత గూటికి కూచుకుళ్ల..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మధ్య విభేదాలు మొదటి నుంచీ ఉన్నాయి. గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన దామోదర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నుంచి తనకు కనీస గౌరవం దక్కడం లేదని చెబుతున్నారు. గత ఎన్నికల్లో తన మద్దతుతో గెలిచిన ఎమ్మెల్యే నాలుగేళ్లుగా తనను పూర్తిగా విస్మరించారని, గౌరవం లేనిచోట ఉండలేనని, పార్టీని వీడుతున్నట్లు ఆయన సంకేతాలు ఇచ్చారు. తన కుమారుడు రాజేశ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా బరిలో దింపాలనే ఆలోచనతో జూపల్లి కృష్ణారావు ఎపిసోడ్ నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జూపల్లి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్‌రెడ్డితో కలిసి రాజేశ్‌రెడ్డి గత నెల 26న ఢిల్లీలో అగ్రనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను కలిశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా దామోదర్‌రెడ్డి కొనసాగుతున్న నేపథ్యంలో ముందుగా రాజేశ్‌రెడ్డి హస్తం పార్టీలో చేరుతున్నారని అందరూ భావించారు. అయితే దామోదర్‌రెడ్డి ఆదివారం ఏకంగా నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. దీంతో ఈ నెల 20న కొల్లాపూర్‌లో జరిగే బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ సమక్షంలో రాజేశ్‌రెడ్డితో కలిసి దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌లో సీనియర్ నేతగా కొనసాగిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఆత్మగౌరవ నినాదంతో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. అయితే ఈసారి ఎన్నికల్లో టికెట్ రాని పక్షంలో ఇరువురిలో ఒకరు కాంగ్రెస్‌కు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

అచ్చంపేటలో రాజేసిన నిప్పు..

అచ్చంపేట నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచేందుకు గువ్వల బాలరాజు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఇక్కడి నుంచి గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రస్తుత ఎంపీ రాములు కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్ సైతం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈసారి ఎన్నికల బరిలో ఉంటానని చెబుతున్నారు. జిల్లా పరిషత్ పీఠం ఆశించిన ఆయనకు భంగపాటు ఎదురుకావడంతో అచ్చంపేటపై నజర్ పెట్టి.. బీఆర్‌ఎస్ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాని పక్షంలో స్వతంత్రంగా.. లేదంటే వేరే పార్టీలో చేరైనా పోటీలో ఉంటానని చెబుతున్నట్లు అనుచరులు చర్చించుకుంటున్నారు.

గద్వాలలో జెడ్పీ చైర్‌పర్సన్..

జోగుళాంబ జిల్లాలోని గద్వాల నియోజకవర్గ పరిధిలో అధికార పార్టీలో అసమ్మతి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. గద్వాలలో ప్రధానంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే తీరులో వైరం ముదిరింది. ఎమ్మెల్యేతో పొసగకపోవడంతో విసిగి వేసారిన సరిత కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితర ముఖ్య నేతలతో భేటీ కాగా.. లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 20న కొల్లాపూర్‌లో జరిగే బహిరంగ సభలో ఆమె కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.

అలంపూర్‌లో..

ప్రాధాన్యం దక్కడం లేదనే అంశాన్ని పక్కనపెడితే అలంపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీకి సంబంధించి ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎంపీ మందా జగన్నాథం మధ్య వైరం ఎప్పటి నుంచో ఉంది. మందా జగన్నాథం కొడుకు శ్రీనాథ్ ఎమ్మెల్యేకు పోటీగా కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఈసారి తన కుమారుడికి టికెట్ ఇప్పించేందుకు మందా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తాను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని జగన్నాథం చెబుతున్నప్పటికీ టికెట్ వచ్చే అవకాశం లేని పక్షంలో పార్టీ మారే అవకాశం ఉన్నట్లు ఆయన అనుచరుల్లో చర్చ జరుగుతోంది.

సీనియార్టీ ఉన్నా..

బీఆర్‌ఎస్‌లో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారిలో సైతం అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. జోగుళాంబ జిల్లాకు చెందిన ఆంజనేయగౌడ్ శాట్ చైర్మన్‌గా ఉండగా ఎమ్మెల్యేతో ఆయనకు పొసగడం లేదు. అలాగే గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాసునాయక్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్‌కు తదితర నేతల మధ్య ప్రొటోకాల్ వివాదం నిత్యకృత్యంగా మారింది. అంతేకాకుండా సీనియార్టీ ఉండి బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న నేతల్లో సైతం నైరాశ్యం అలుముకుంది. మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడిగా ఉన్న సీనియర్ నాయకుడు దేవర మల్లప్ప అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కేసీఆర్‌కు సన్నిహితుడిగా పేరున్న ఆయనకు గతంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. ఆ తర్వాత పార్టీ ఆయనకు ఎలాంటి అవకాశాలు కల్పించలేదు. మరో సీనియర్ నాయకుడు వర్కటం జగన్నాథరెడ్డి సైతం ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నా అధిష్టానం పట్టించుకోవడం లేదనే అసంతృప్తి నెలకొంది. ఇలా సొంత పార్టీలో సరైన గౌరవం దక్కడం లేదంటూ నాయకులు ఆత్మగౌరవ నినాదంతో ధిక్కార స్వరం వినిపిస్తోంది. ఎన్నికల వేళ ఈ పరిణామాలు అధికార పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అబ్దుల్ ఖాదర్ దర్గా వద్ద రహమానియా బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని కొన్ని రహదారులపై ఆక్రమణలు ఉన్నాయని, వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక వేపురిగేరి వద్ద పెద్ద మురుగు కాల్వ ఉన్నందున స్థానికులకు దుర్గంధం వెదజల్లుతోందని అక్కడ త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంతోపాటు ఫౌంటెయిన్ సైతం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఆయన అబ్దుల్‌ఖాదర్ దర్గా వద్ద రహమానియా బ్రిడ్జిని ప్రారంభించారు. అలాగే ఏనుగొండ కూడలిలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక విశాలమైన రహదారులు, జంక్షన్ల అభివృద్ధితోపాటు పట్టణానికి ఒక రూపు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్మన్ వెంకటయ్య, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, డీఈఈ బెంజిమన్, డీఎస్పీ మహేష్, ఆర్‌అండ్‌బీ డీఈ సంధ్య, ఎన్‌హెచ్ఏఐ ఏఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం లావాదేవీలు జరుగుతాయి. సీజన్ లేకపోవడం వల్ల బుధవారం ఉల్లి వ్యాపారం తర్వాత గురువారం నుంచి మార్కెట్‌లో లావాదేవీలు జరగలేదు. అయితే సోమవారం మార్కెట్‌లో లావాదేవీలు తిరిగి కొనసాగనున్నాయి. రైతులు తమ ధాన్యం తెచ్చి అమ్ముకోడానికి వీలుంది. మంగళవారం బోనాల పండుగ సందర్భంగా మార్కెట్‌కు సెలవు ఉంటుంది. అలాగే బుధవారం సైతం సెలవు ఇచ్చే అవకాశం ఉంది.

దాబాల్లో.. దర్జాగా

- ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సిట్టింగ్ నడుపుతున్న నిర్వాహకులు
- పల్లెల్లో మినీ బార్లను తలపిస్తున్న బెల్టు దుకాణాలు
- వీటిపైనే ఎక్కువగా దృష్టిసారిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ యంత్రాంగం
- మామూళ్ల మత్తులో కొందరు అధికారులు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో దాబాల్లో ప్రత్యేకంగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకుని వాటిలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్నా.. పల్లెల్లో బెల్టు దుకాణాలు మినీ బార్లను తలపిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేం సంబంధం లేదన్నట్టు చోద్యం చూస్తున్నారు. దాబాల్లో పర్మిట్ గదులు, అక్రమ మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని నిబంధనలు ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాకేంద్రం బైపాస్ రోడ్‌తో పాటు ఎదిర, భూత్పూర్, దేవరకద్ర, కోయిలకొండ మార్గాల్లో ఏ రోడ్డు చూసినా విచ్చలవిడిగా దాబాలు వెలిశాయి. ఓపెన్‌గా సిట్టింగ్ ఏర్పాటు చేసి 24 గంటలపాటు మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. మద్యం దుకాణాల కంటే రెట్టింపు స్థాయిలో ఈ దాబాల్లో వ్యాపారం సాగుతుంది. కొన్ని దాబాల్లో చిన్నారులను పనుల్లో పెట్టుకుని మద్యం సరఫరా చేయిస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న దాబాల్లో సైతం మద్యం దందా జోరుగా జరుగుతున్న సదరు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

లెక్కకు మించి ఏర్పాటు

మహబూబ్‌నగర్ జిల్లాలో బెల్టు దుకాణాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. మద్యం వ్యాపారులు ఎక్కువ శాతం ఈ దుకాణాలపైనే దృష్టిసారిస్తున్నారు. జిల్లాలో 98 వైన్స్ దుకాణాలుండగా ఒక్కో దానికి సగటున 20 వరకు బెల్టు దుకాణాలతో సంబంధాలుండటం విశేషం. మరికొందరు దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి పల్లెల్లో ఇళ్ల దగ్గర, చిన్న పాటి హోటళ్లు, కిరాణదుకాణాల్లో దర్జాగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఎమ్మార్పీ పేరుతో బోర్డులు తగిలిస్తున్న వ్యాపారులు బెల్టుల సాయంతో అక్రమార్జనకు తెరలేపుతున్నారు. అదనపు వాటాల కోసం కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇదీ చాలదన్నట్లు మద్యంప్రియుల బలహీనతే ప్రధాన పెట్టుబడిగా బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిరోజు వైన్స్‌తో సరిసమానంగా బెల్టు దుకాణాల్లో వ్యాపారం సాగుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో బెల్టు దుకాణాల ద్వారా నిత్యం రూ.50 లక్షల వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా కొన్ని వైన్స్ ఇదే పనిగా ముందుకు సాగుతున్నాయి. అధికారికంగా డిపో నుంచి సరుకు తెచ్చుకుని రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. వాటిని వైన్స్‌లో కాకుండా బెల్టు దుకాణాలకు తరలిస్తున్నారు. వైన్స్‌లో ఎమ్మార్పీకి విక్రయించాల్సిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇలా అక్రమార్జనకు తెరలేపుతున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

తనిఖీలు జరుపుతాం..

దాబాల నిర్వాహకులను ఇప్పటికే 15 మందిని ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగింది. మళ్లీ దాబాల్లో మద్యం విక్రయాలు చేస్తే కేసు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎక్కడ దాబాల్లో మద్యం విక్రయాలు జరిగినా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడుతాం.
– సైదులు, ఈఎస్, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ వెళ్లే రోడ్డులో ఉన్న ఓ దాబాలో మందుబాబుల సిట్టింగ్

నాసికరం మద్యం

బెల్టు దుకాణాల్లో అమ్మకాలు నాసిరకం మద్యానికి దారి తీస్తున్నాయి. వైన్స్ నుంచి తీసుకొచ్చిన దానికి దుకాణదారులకు చెల్లించిన దానికంటే అదనంగా రూ.20 నుంచి రూ.30 పెంచి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఇది చాలదన్నట్లుగా సీసాల్లో మద్యాన్ని తొలగించి నీళ్లు కలుపుతున్నారు. బెల్టు దుకాణాల్లో బీర్లు కొనుగోలు చేయాలన్నా అదనంగా రూ.40 చెల్లించక తప్పడం లేదు. ఎక్కువ శాతం చీప్ లిక్కర్ తాగే వారి కోసమే బెల్టు దుకాణాల్లో కొన్ని బ్రాండ్లను అసలు ధర కంటే అదనంగా రూ.40కి విక్రయిస్తున్నారు. జిల్లాలో సుమారు 2 వేల కంటే ఎక్కువ సంఖ్యలో బెల్టు దుకాణాలు గల్లీ గల్లీలో వెలిశాయి. బెల్టు దుకాణదారులకు మద్యాన్ని సరఫరా చేయడం వల్ల సిండికేటు దందా సాగించే వారికి రోజువారీగా సగటున రూ.20 లక్షల ఆదాయం అదనంగా సమకూరుతోందని అంచనా. రూ.లక్షలు వెచ్చించి టెండర్ల ద్వారా దుకాణాలు దక్కించుకున్నందుకు లాభసాటిగా ఉండాలనే తాపత్రయంతో నిలువునా ముంచేస్తున్నారు. మరోపక్క అదనంగా డబ్బులు చెల్లించి బెల్టు దుకాణాలను కొనసాగించినందుకు మాకు లాభం లేకపోతే ఎలా..? అనే ధోరణితో బెల్టు దుకాణదారులు నకిలీ మద్యంతో మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఈ దందా అంతా రాత్రి పూట ఎక్కువగా జరుగుతుండటంతో ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు.

నేటినుంచి బియ్యం పంపిణీ

- చౌకధర దుకాణాలకు చేరుకున్న సరుకు



జిల్లాలో కార్డులు ఇలా..

చౌకధర దుకాణాలు	ఆహార భద్రత కార్డులు
506	2,20,644
అన్నపూర్ణ కార్డులు	**అంత్యోదయ కార్డులు**
205	18,887

మహబూబ్‌నగర్ రూరల్: చౌకధర దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం ఆలస్యమవుతుంది. వాస్తవానికి ఒకటో తేదీ నుంచే పంపిణీ చేయాల్సి ఉండగా అలా జరగడం లేదు. ఇప్పుడిప్పుడే ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి దుకాణాలకు చేరుతుంది. జిల్లాలో 506 చౌకధర దుకాణాలు ఉన్నాయి. ఆహార భద్రత కార్డులు 2,20,644 ఉండగా.. ఒక్కో సభ్యుడికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం ఇస్తున్నారు. అలాగే అంత్యోదయ కార్డులు 18,887 ఉండగా కార్డుకు 35 కిలోలు, అన్నపూర్ణ 205 ఉండగా కార్డుకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తారు. ప్రతినెలా చివరి వారంలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సంచులు చౌకధర దుకాణాలకు చేరితే 1 నుంచి 15 వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా ఆరునెలల నుంచి అమలు కావడం లేదు. నెలలో మొదటివారం.. లేదంటే రెండో వారంలో ఇస్తున్నారు. ఎప్పుడిస్తారనే కనీస సమాచారం కూడా ఉండటం లేదు.

వేలిముద్రల వల్లే ఆలస్యం..

ఇది వరకు దుకాణాల వారీగా రేషన్ కోటా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి వచ్చేది. ఈ నెల నుంచి డీలర్లు స్థానికంగా ఉండే ఎంఎల్‌ఎస్ పాయింట్లకు వెళ్లి వేలిముద్ర వేస్తేనే కోటా దుకాణాలకు చేరుతుంది. సర్వర్ డౌన్ కావడంతో వేలిముద్రలు పడక చౌకధర దుకాణాలకు సరైన సమయంలో బియ్యం చేరలేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికీ సగం దుకాణాలకు కూడా బియ్యం సరఫరా కాలేదు.

ఆరు కిలోల చొప్పున..



కుటుంబంలోని ప్రతి సభ్యుడికి ఆరు కిలోలు ఇవ్వాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చాం. 12 కిలోలు ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాగే ఈ నెలకు సంబంధించిన బియ్యాన్ని సోమవారం నుంచి పంపిణీ చేయాలని సూచించాం.
– బాలరాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ప్రజాసేవే ఏకైక లక్ష్యం

- ప్రజాహిత పాదయాత్రలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి



పర్వతాపూర్ మైసమ్మ ఆలయం నుంచి పాదయాత్ర చేస్తున్న అనిరుధ్‌రెడ్డి తదితరులు

నవాబుపేట/ రాజాపూర్: ప్రజాసేవే ఏకైక లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, ఇందులో భాగంగానే వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపేందుకు ప్రజాహిత పాదయాత్ర చేపట్టినట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడలో ఇంటిదైవమైన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నవాబుపేట మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేసిన తర్వాత ప్రజాహిత పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న బీఆర్‌ఎస్ నియంత పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందాలన్నదే తన లక్ష్యం అన్నారు. కానీ, అధికార పార్టీ నాయకులు తమ అనునాయులకే పథకాలు అందిస్తున్నారని ఆరోపించారు. అందుకే రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పాదయాత్రలో ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆవశ్యకతను వివరిస్తామని, వారి సమస్యలు తెలుసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రదీప్‌గౌడ్, సంజీవ్‌ముదిరాజ్, దుశ్యంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వసంత, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, డాక్టర్ మీనాక్షి, తులసీరాంనాయక్, ఆంజనేయులు, కుమార్, రాములునాయక్, జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, రాములుగౌడ్, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దాక పోరాటం చేస్తామన్నారు. తమ పోరాటానికి వివిధ ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. పాత పెన్షన్ సాధన కోసం సంకల్ప రథయాత్ర ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ నెల 16న అలంపూర్ నుంచి ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఈ నెల 31న ముగుస్తుందన్నారు. యాత్రకు టీజీఓ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, పీఆర్టీయూ రఘురాంరెడ్డితోపాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం


రాజశేఖర్ (ఫైల్)

కేటీదొడ్డి: కుటుంబ సభ్యులు మందలించడంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతపాలెంకు చెందిన రాజశేఖర్(29) పదో తరగతి వరకు చదివి, గ్రామంలో ఖాళీగా తిరిగేవాడు. దీంతో ఏదైనా పనిచేసుకోవాలని కుటుంబ సభ్యులు మందలించడంతో 6వ తేదీ పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఉరేసుకొని స్టాఫ్‌నర్స్ మృతి


దివ్య (ఫైల్)

ఊట్కూర్ : ఊట్కూర్ ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ దివ్య (35) తన క్వార్టర్స్‌లో ఉరేసుకొని మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. మనికొండ గ్రామానికి చెందిన దివ్య 15 ఏళ్లుగా స్టాఫ్‌నర్స్‌గా ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తోంది. ఊట్కూర్ గ్రామానికి చెందిన గొల్ల శ్రీకాంత్‌తో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కలిసి ఆస్పత్రి క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నది. దీన్ని గమనించిన స్థానికులు భర్తకు సమాచారం అందించారు. వెంటనే భర్త ఆమెను నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వారికి తొమ్మిదేళ్ల కూతురు ఆరాధ్య, ఏడేళ్ల కుమారుడు మణికంఠ ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని, వచ్చిన వెంటనే దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

భూత్పూర్ : మండలంలోని కర్వెన ప్రాజెక్టు నిర్మిస్తున్న ప్రసాద్ కంపెనీలో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణమూర్తి (51)ని కట్టమీద టిప్పర్ ఢీకొట్టింది. వెంటనే చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన రమణమూర్తి ఆరేళ్లుగా మండలంలోని కర్వెన ప్రాజెక్టు 15వ ప్యాకేజీకి చెందిన ప్రసాద్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వస్తున్నాడు. విధులో భాగంగా రమణమూర్తి ఆదివారం కట్టపై ఉండగా టీఎస్07యూ 8705 నంబరు గల టిప్పర్ రివర్స్ తీసుకుంటుండగా ఢీకొట్టడంతో వెనక టైరికింద పడ్డాడు. వెంటనే డ్రైవర్ ప్రసాద్ కంపెనీ వారికి సమాచారం ఇచ్చారు. కంపెనీ వారు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని సీటి న్యూరో ఆసుపత్రికి తరలించగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతిచెందాడు. అతన్ని మేనల్లుడు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ రఘుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంగాల చెరువులో మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: మండలంలోని సంగాల చెరువులో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ఆనంద్ కథనం మేరకు.. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి(45) రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఉదయం రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో వాకింగ్‌కు వచ్చిన స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఎవరనేది తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్ సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యనా? ఎవరైనా దాడి చేసి చంపారా? అనే విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

గేటు విరిగిపడి ఆర్టీసీ ఉద్యోగికి గాయాలు

నారాయణపేట రూరల్: ఆర్టీసీ డిపోలో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి గాయాలపాలైన ఘటన నారాయణపేటలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మరికల్ పట్టణానికి చెందిన భాస్కర్ స్థానిక డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ, ఇటీవలే ఓడీలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి తర్వాత బస్సులు డిపోలో కి వచ్చిన తర్వాత గేటు మూసివేశాడు. ఉదయం 4గంటలకు మొదటి బస్సు బయటకు వెళ్లే సమయంలో గేటు తెరుస్తుండగా విరిగి మీద పడడంతో గాయపడ్డాడు. వెంటనే ప్రైవేటు బస్సుల డ్రైవర్లు వచ్చి గేటును పక్కకు తీసి ఆయనను దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. తలకు గాయం, గొంతు వద్ద ఎముక విరిగినట్లు తెలిసింది. ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన గేటు మరమ్మతులు లేక ఊడిపోయి ఉంటుందని ఆర్టీసీ ఉద్యోగులు అంటున్నారు. అయితే సంఘటన జరిగిన సమయంలో ఇటు ఆన్‌డ్యూటీ కంట్రోలర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ముంపు కాలనీపై.. ముందుచూపేది?


రాజీవ్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

- వర్షమొస్తే రాకపోకలకు అంతరాయం
- ఇళ్లలోకి చేరుతున్న నీరు
- దుర్వాసనతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


రాజీవ్‌కాలనీలో ఇళ్లలోకి చేరిన వరద నీరు(ఫైల్)

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయి. వర్షమొస్తే చాలు ఆయా కాలనీల్లోకి భారీగా వరద నీరు చేరి కాలనీలు నీట మునుగుతున్నాయి. ఇళ్లలోకి నీళ్లు రావడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరద నీటితో పాటు మురుగు రావడంతో దుర్వాసనతో తల్లడిల్లుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో ఇండ్లల్లో ఉండలేని పరిస్థితి ఉంటోంది.

ముంపునకు గురయ్యే కాలనీలు..

కావేరమ్మపేట పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, డీవీఆర్ నగర్, శ్రీనివాస కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బాబానగర్, కావలిగేరి, బాదేపల్లిలోని రాజీవ్‌నగర్, శివాజీనగర్, శాంతినగర్, వెంకటేశ్వరకాలనీ, చైతన్యనగర్ కాలనీలు వరద నీటి ముంపునకు గురవుతున్నాయి.

ఎగువ ప్రాంతం నుంచి వరద..

44వ నంబర్ జాతీయ రహదారి దిగువ ప్రాంతం నుంచి మొదలైన వరద రంగ నాయకస్వామి గుట్ట వైపు పారడంతో లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. వరద నీటిని పంపేందుకు సరైన కాలువలు లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు రోడ్లపైకి వచ్చి కాలనీలను ముంచెత్తుతున్నాయి. నల్లకుంట ప్రాంతంలో ఇటీవల నిర్మించిన కాలువ నేతాజీ చౌరస్తా-సిగ్నల్‌గడ్డ ప్రధాన రహదారిపై డ్రైనేజీ కాలువలు మూసుకుపోవడంతో వెంకటేశ్వర కాలనీ ముంపుకు గురవుతుంది. శాంతినగర్, శివాజీనగర్ కాలనీలు ఇదే కోవలో ఉన్నాయి. రాజీవ్‌నగర్ కాలనీ పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

ఏటా ఇదే సమస్య..



వర్షమొస్తే ప్రతి ఏడాదీ మా ఇంట్లోకి వరద నీరొస్తుంది. ఇంట్లోని బియ్యం, ఇతర సామన్లు తడిసిపోతున్నాయి. రెండు మూడు రోజులు మేము వేరే చోట తలదాచుకుంటాం. నీరు తగ్గినాక ఇండ్లను కడుక్కోవడానికి వారం రోజులు పడుతుంది.

– వెంకటమ్మ, రాజీవ్ నగర్, బాదేపల్లి

పట్టించుకోవడం లేదు..



వరద ముంపు వచ్చినప్పుడల్లా అధికారులకు, పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కాలనీలో ముంపు నీటి సమస్యను పరిష్కరించాలి.

–నయూం, రాజీవనగర్, బాదేపల్లి

చర్యలు తీసుకుంటాం..



మున్సిపాలిటీ పరిధిలో వరద ముంపునకు గురయ్యే కాలనీలను గుర్తించాం, కాలనీల్లో డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద వల్ల కాలువలు నిండి ఇండ్లలోకి నీరు వస్తోంది. వరద నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

–మహ్మద్ షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

నాలాలు ఆక్రమణ

పట్టణంలోని పలు కాలనీలలో మురుగు కాలువలను ఆక్రమించి ఇండ్లను నిర్మించుకోవడం, వాటిపై మెట్లు, తదితర నిర్మాణాలు చేపట్టడంతో నాలాలు మూసుకుపోయి వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ముంపు కాలనీల సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమగ్ర ప్రణాళికలు రూపొందించి వరద ముప్పు నుంచి కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- స్కూటీని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ఇందిరానగర్‌లో విషాదఛాయలు
- ఇద్దరూ జడ్చర్ల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులే..


చెన్నయ్య(ఫైల్)


నాగార్జున (ఫైల్)

మిడ్జిల్/జడ్చర్ల : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం మిడ్జిల్ మండల పరిధిలోని వాడ్యాల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం ప్రకారం.. జడ్చర్లలోని ఇందిరానగర్‌కు చెందిన నాగార్జున(25) వెంకటేశ్వర కాలనీకి చెందిన చెన్నయ్య(37)మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. ఇద్దరు ఉదయం 10 గంటల వరకు విధులు నిర్వహించి, అనంతరం తలకొండపల్లి మండలంలో చెన్నయ్య బంధువుల ఇంటి దగ్గర బియ్యం తెచ్చుకోవడానికి స్కూటీపై బయలు దేరారు. మిడ్జిల్ మండల పరిధిలోని మున్ననూర్-వాడ్యాల్ గ్రామ సమీపంలో మలుపు వద్ద జడ్చర్ల-కల్వకుర్తి ప్రధాన రహదారిపై స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో నాగార్జున అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న చెన్నయ్యను 108లో తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే జడ్చర్ల రూరల్ సీఐ జములప్ప, ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ ఘటన స్థలానికి చేరుకోని పరిశీలిచారు. అనంతరం మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకోని ప్రమాదానికి కారణమైన వాహనం కోసం సీసీ టీవీ పూటేజీలను పరిశీలిస్తున్నారు.

ఇందిరానగర్‌లో విషాదఛాయలు..

జడ్చర్ల మున్సిపాలిటీ పరిదిలోని ఇందిరానగర్‌లో ఆదివారం విశాదచాయలు అలుముకున్నాయి. రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయా కుటుంబాలతో పాటు కాలనీ వాసులు దుఖసాగరంలో మునిగిపోయారు.

గతంలో అన్న.. ఇప్పుడు తమ్ముడు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగార్జున అన్న రాజశేఖర్ రెండేళ్ల క్రితం జడ్చర్ల సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో మృత్యువాత పడ్డాడు. రాజశేఖర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసేవాడు. అతను చనిపోవడతో ఉద్యోగాన్ని తమ్ముడు నాగార్జునకు ఇచ్చారు. ఒకే ఇంట్లో కొడుకులు చనిపోవడంతో తల్లిదండ్రులు బీమయ్య, మణెమ్మలు దిక్కులేనివారు అయ్యారు. వారి రోదన అందరిని కలిచివేస్తోంది. చెన్నయ్యకు భార్య జంగమ్మ, కుమారుడు బాను, కూతురు హారిక ఉన్నారు. ఇరుకుటుంబాల్లో అంతులేని విషాదం అలుముకుంది.

కుటుంబాలను ఆదుకుంటాం : కమిషనర్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పారిశుద్య కార్మికుల కుటుంబాలను ఆదుకుంటామని ఆదుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపారు. ఇరు కుటుంబాల్లో వారికి పారిశుద్య కార్మికులుగా అవకాశం కల్పిస్తామన్నారు.

ముళ్లపొదల్లో మహిళ మృతదేహం

- హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసుల విచారణ


కావలి లక్ష్మి(ఫైల్)

మక్తల్ : మున్సిపల్ పరిధిలోని రిజర్వాయర్ కాల్వ వద్ద కంపచెట్లలో శనివారం రాత్రి గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. సెల్‌ఫోన్ వాట్సాప్‌ల ద్వారా పోలీసులకు సమాచారం రావడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన వారు అస్పత్రికి వెళ్లి చూడగా మృతదేహం కావలి లక్ష్మి (48)గా గుర్తించారు. మక్తల్ సీఐ రాంలాల్, మక్తల్ ఎస్ఐ పర్వతాలు కథనం ప్రకారం.. యాదవనగర్‌కు చెందిన లక్ష్మి ఈనెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. గతంలో కూడా ఇలాగే వెళ్లి మళ్లీ తిరిగి వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మళ్లీ వస్తుందని అనుకున్నారు. ఈసారి తిరిగి రాకుండా చెట్లపొదల్లో మృతదేహంగా కనిపించింది. ఆమె మృతి పలు అనుమానాలకు దారితీస్తోంది. ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగించి హత్య చేశారా? లేక ఎక్కడో హత్య చేసి ఇక్కడ తెచ్చి పడేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆమె వెళ్లిన రోజు రోడ్లపై ఉన్న సీసీపుటేజీలను పరిశీలించగా అన్నతో పాటు లక్ష్మి కల్లు తాగేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తర్వాత ఆమెను ఇంటివద్ద అతను దించిపోయాడు. ఈ ఘటనపై మృతదేహం లభ్యమైన పొలం యజమాని భీమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం ప్రభుత్వాసుపత్రిలో లక్ష్మి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జల్సాలకు అలవాటు పడి.. దొంగలుగా మారి...

- సీసీ కెమెరాకు చిక్కిన నిందితులు
- దొంగతనానికి దోస్తులంతా కలిశారు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రమేష్

కల్వకుర్తి టౌన్: జల్సాలకు అలవాటు పడిన నలుగురు యువకులు పథకం వేసి దొంగతనం చేస్తూ సీసీ కెమెరాలకు చిక్కి కటకటాల పాలైన సంఘటన ఆదివారం గుండూరు గ్రామ పెట్రోల్‌పంపులో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. మండలంలోని గుండూర్ గ్రామంలో ఉన్న భారత్ పెట్రోలియం బంక్‌లో సాయికుమార్ క్యాషియర్‌గా కొంత కాలంగా పనిచేస్తున్నాడు. అతని సొంత గ్రామం తెల్కపల్లిలో ధన్‌రాజు, దయాసాగర్, క్రాంతికుమార్ అనే స్నేహితులున్నారు. వీరంతా చదువుకుంటుండగా జల్సాలు చేయడానికి డబ్బు కావల్సి వచ్చింది. ఈ విషయాన్ని సాయికుమార్ ఊరెళ్లినపుడు స్నేహితులు చెప్పారు. నలుగురు కలిసి సాయికుమార్ పనిచేస్తున్న పెట్రోల్‌బంక్‌లో దొంగతనం జరిగినట్లు నాటకమాడి డబ్బు కొట్టేయాలనుకున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం సాయికుమార్‌ను బెదిరించి క్యాష్ దొంగతనం చేయాలనుకున్నారు. అందుకు అతను సహకరించాలని నిర్ణయించుకున్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారం గత నెల 30వ తేదీన ముగ్గురు స్నేహితులు ధన్‌రాజు, దయాసాగర్, క్రాంతికుమార్‌లు స్కూటీపై బంక్‌కు వచ్చారు. బంక్‌లో దొంగతనానికి వీలుపడదని సాయికుమార్ చెప్పడంతో ముగ్గురు తిరిగి వెళ్లిపోయారు. మరల ఈ నెల 1వ తేదీన సాయంత్రం సమయంలో స్కూటీపై వచ్చి, బంక్‌లో క్యాష్ లెక్కిస్తున్న సాయికుమార్‌ను కత్తితో బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.1.10 లక్షలు తీసుకొని వెళ్లిపోయారు. ఈ విషయం బంక్ యజమాని సునీల్‌కుమార్‌రెడ్డికి చెప్పడంతో అదేరోజు రాత్రి 12 గంటలు దాటాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పట్టించిన సీసీ కెమెరాలు

దొంగతనంపై అనుమానం రాకుండా సాయికుమార్ యజమానికి, పోలీసులకు సమాచారం ఇచ్చి ఏమీ తెలియనట్లుగా వ్యవహరించాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా బంక్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ రోజు రోడ్డును క్రాంతి పరిశీలిస్తుండగా, బంక్‌లోకి దయాసాగర్, ధన్‌రాజులు వెళ్లారు. కత్తితో క్యాషియర్‌ను బెదిరించగా వెంటనే అతను వారికి డబ్బులు ఇచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. పోలీసులకు అనుమానం వచ్చి క్యాషియర్‌ను విచారిస్తే అసలు విషయం బయటికొచ్చింది. ధన్‌రాజు పరారీలో ఉండగా ముగ్గురు నిందితులను సీనియర్ సివిల్ జడ్జి కావ్య ముందు ప్రవేశపెట్టారు. వారికి రిమాండ్ విధించి రూ.60వేలు రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారిని మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించారు.

గుప్త నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు


తవ్వకాలు జరిపిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ప్రధాన ఆలయం


ఆలయ మండపంలో తవ్వకాలు చేసిన దుండగులు


తవ్వకాలకు ఉపయోగించిన పారలు గడ్డపారలు, ఇతర సమాగ్రి

బాలానగర్ : బాలానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి శివారులో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధులకోసం తవ్వకాలు నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. అమ్మపల్లి గ్రామ సమీపంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో రాత్రి ఒంటిగంట సమయంలో ఏడుగురు గుర్తు తెలియని దుండగులు ప్రధాన అలయం మండపంలో, పక్కనే ఉన్న శివాలయం మండపంలో తవ్వకాలు చేశారు. తవ్వుతున్న సమయంలో శబ్దం రావడంతో కొందరు అమ్మపల్లి గ్రామస్థులు ఆలయ ప్రహరీ వద్దకు చేరుకున్నారు. దీన్ని గమనించిన దుండగులు గడ్డపారలు, పారలు, గంపలు, టెంకాయలు, నిమ్మకాలు, వాటర్ బాటిల్స్, బ్యాగులు, హెల్మెట్స్ అక్కడే వదిలేసి ఆలయం ప్రహరీ దూకి పారిపోయారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించిన గ్రామస్తులకు ఇద్దరు చిక్కి, ఐదుగురు పారిపోయారు. గాయాల పాలై ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులు, స్టేట్ టాస్క్‌ఫోర్స్, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం వాహనాలు తనిఖీ చేసి గోవా మద్యాన్ని పట్టుకున్నారు. గోవా నుంచి తీసుకొచ్చిన 06బాటిల్స్ మద్యం దొరికినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. తనిఖీలో ఎస్ఐ రాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, గణపతి రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

120 కిలోల నల్లబెల్లం స్వాధీనం

అచ్చంపేట రూరల్ : మండలంలోని లింగోటం శివారులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా కారులో 120కేజీల నల్లబెల్లం పట్టుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ పరమేష్‌గౌడ్ కథనం ప్రకారం.. నిషేధిత నల్లబెల్లం సరఫరా చేస్తూ పట్టుబడిన కారును సీజ్ చేసి నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. హాజీపూర్, పలకపల్లి శివారులో 6లీటర్ల నాటుసారాను తరలిస్తున్న రెండు బైక్‌లను సీజ్ చేశారు. ఆయన వెంట ఎస్ఐ బాలరాజు, సిబ్బంది ఆసిఫ్, నవీన్, రవి, రఘు, తిరుపతిరెడ్డి ఉన్నారు.



విత్తనశుద్ధితోనే అధిక దిగుబడి


పొలంలో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ఆధునిక వ్యవసాయంలో నాణ్యమైన విత్తనం అధిక దిగుబడి సాధించడానికి దోహదపడుతుంది. విత్తనాలను నిల్వచేసుకోవడం, కొనుగోలు సమస్యలతో పాటు పురుగు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవడం రైతుకు తలకు మించిన భారంగా మారింది. అయితే రైతులు విత్తనశుద్ధితో పంట సాగులో ఎదురయ్యే సమస్యలను కొంత వరకు అధిగమించడానికి అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. విత్తనశుద్ధి చేయకపోతే తెగుళ్లు, పురుగులు నేల నుంచి ఆశించి మొక్కల సాంద్రతను, దిగుబడిని గణనీయంగా తగ్గించే ప్రమాదం ఉందని తెలిపారు. ఖరీఫ్‌లో పంటసాగు చేస్తున్న రైతులకు విత్తనశుద్ధి వల కలిగే లాభాలను వ్యవసాయ శాఖ ఏడీఏ ఈ విధంగా వివరించారు.

మొలకశాతం పెరుగుతుంది..

పంట సాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి క్రమం తప్పకుండా చేయాల్సి ఉంటుంది. విత్తన శుద్ధితో మొలక శాతం పెరిగి సాంద్రత సిఫార్సు మేరకు ఉంటుంది. తొలి దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుతుంది. దీంతో మొక్క ఏపుగా పెరగడానికి అవకాశం ఉంది. చీడ పీడల ఉధృతిని తగ్గించి తర్వాత దశలో ఆశించే రసం పీల్చు పురుగులు, వైరస్ తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. రైజోబియం వలన నత్రజని స్థిరీకరణ జరుగుతుందని సూచించారు. అంతేకాక వాతవరణ కాలుష్యం తగ్గి, మిత్ర పురుగులు రక్షించబతాయని తెలిపారు.

వివిధ పంటల్లో విత్తనశుద్ధి :

విత్తన శుద్ధి ఒక్కో పంటకు ఒక విధానం ఉంటుంది. వాటిని గమనించి రైతులు జాగ్రత్తలు పాటిస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయి.

వరి : ఒక కిలో వరి విత్తనంలో ఒక గ్రామ్ కార్బెండజిమ్, ఒక లీటర్ నీటిలో కలిపిన ద్రావణంలో ఒక రోజు నానబెట్టాలి. ఒక రోజు మండెకట్టి నారు మడిలో చల్లడం వలన అగ్గి తెగులు, ఆకుమచ్చ, పొడతెగుళ్లను అదుపు చేయవచ్చు.

మొక్కజొన్న: ఒక కిలో విత్తనానికి 3 గ్రామంలో థైరామ్ లేదా కాప్టాన్ కలిపి శుద్ధి చేస్తే ఎండు తెగులు, కాటక తెగులు, మచ్చ తెగుళ్లను అదుపు చేయవచ్చును.

వేరుశనగ : కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌తో శుద్ధి చేస్తే తిక్కాకు, ఆకుమచ్చ, త్రుప్పు, కాంత కాళ్ల తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు.

పత్తి : బ్యాక్టీరియా వల్ల నల్ల మచ్చ ఆశించే ప్రాంతాలల్లో లీటర్ నీటిలో 100 మిల్లీ గ్రాముల వైంసన్ లేదా ప్లాంటామైసీన్ గాని, ఒక గ్రామ్ బ్లైటాక్స్ కలిపిన ద్రావణంలో శుద్ధి చేసిన విత్తనాలను 6-8 గంటలు నానబెట్టి ఆ తర్వాత ఆరబెట్టుకోని విత్తుకుంటే ప్రయోజనం ఉంటుంది.

మిరప : మిరపలోని వైరస్ తెగుళ్ల నివారణకు ఒక లీటర్ నీటిలో 150 గ్రాముల ట్రై సోడియం, ఆర్థ ఫాస్పేట్‌ను ఒక కిలో మిరప విత్తనాన్ని 12 గంటలు నానబెట్టి తర్వాత చల్లటి నీటిలో కడిగి విత్తుకోవాలి. దీంతో మంచి దిగుబడి సాధించవచ్చు.

ముందస్తు జాగ్రత్తలు మంచిది..

చీడపీడలు వ్యాప్తిచెందిన తర్వాత సస్యరక్షణ పద్ధతులు పాటించడం కన్నా, వాటిని ముందుగానే విత్తన శుద్ధితో అదుపు చేసుకోవాలి. దీనివలన పంట నాణ్యత పెరగడమేకాక అధిక దిగుబడి సాధించి ఆదాయం పొందవచ్చు.

విత్తనశుద్ధిలో జాగ్రత్తలు ఇలా..

విత్తనశుద్ధిలోనూ రైతులు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అప్పుడే పంటలను కాపాడుకుని అధిక దిగుబడి సాగించడానికి వీలుంటుంది. విత్తన శుద్ధికి సరైన మందులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. విత్తనంలో తేమశాతం ఎక్కువగా ఉండకుండా జాగ్రత్త పడాలి. సరైన మోతాదు మందులు వాడాలి. విత్తనం పైపొర ఊడిపోకుండా చూసుకోవాలి. అయితే విత్తనశుద్ధి చేసిన విత్తనాలను పశువుల దాణాగా వాడకూడదని రైతులు గుర్తుంచుకోవాలి. ఇలా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పకుండా పాటించాల్సి ఉంటుంది.

పశువుల మందపై పెద్దపులి దాడి



మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిధిలోని వటువర్లపల్లి గ్రామం సమీపంలోని ఎల్లమయ్య కుంట వద్ద పశువుల మందపై పెద్దపులి దాడి చేయడంతో ఆవు మృతి చెందిన ఘటన నల్లమలలో ఆదివారం చోటుచేసుకుంది. పశువుల కాపరి కథనం మేరకు.. వటువర్లపల్లి గ్రామం దేవగోని అరుణమ్మ, మల్లయ్యకు చెందిన పాడి ఆవు పశువుల మందలో అడవికి మేతకు వెళ్లింది. ఈ క్రమంలో ఎల్లమయ్యకుంట వద్ద పెద్దపులి పశువుల మందపై దాడి చేసి ఆవును చంపేసింది. పెద్దపులి దాడితో మందలోని పశువులన్నీ చెల్లాచెదురయ్యాయి. వెంటనే పశువుల కాపరి సల్వాది ఉసేన్ భయంతో పెద్దచెట్టు ఎక్కి కేకలు వేశాడు. పెద్దపులి అక్కడి నుంచి పారిపోయింది. పశువుల కాపరి వేసిన కేకలు విని గ్రామస్తులు కొందరు అరుపులు, కేకలు వేస్తూ అక్కడికి వచ్చారు. అనంతరం ఆ పరిసర ప్రాంతాన్ని పరిశీలించగా పాడి ఆవు మృతదేహం కనిపించింది. ఆవు సుమారు రూ.40వేలు ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

క్లుప్తంగా...

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు



ఆలయం వెలుపల జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్‌లు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 86,781 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.47 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో.. ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకున్నారు.

లంక భూములకు పట్టాలు

9 వేల ఎకరాలు..

19 వేల మందికి పైగా లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి నదీ తీరంలో ఉన్న లంక భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చేందుకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎనిమిది జిల్లాల్లో ఉన్న కృష్ణా, గోదావరి లంకల్లోని 9,062 ఎకరాలకు సంబంధించిన 19 వేల మందికిపైగా ఈ పట్టాలు ఇవ్వనుంది. మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేయడమే తరువాయి. ఆ తర్వాత పట్టాల పంపిణీ ప్రారంభం కానుంది. ఏపీలోని నిరుపేదలకు 54 వేల ఎకరాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్న విషయం తెలిసిందే. ఆ భూములతోపాటే లంక భూములను సాగుచేసుకుంటున్న రైతులకు డి-పట్టాలు ఇవ్వనున్నారు. ఈ భూములను మూడు కేటగిరీలుగా విభజించారు. గట్టుకు దగ్గరగా ఉండి వరద వచ్చినా కొట్టుకుపోని భూమిని ఏ-కేటగిరీగా.. వీటికి ఆనుకుని కొంత నదిలోకి ఉన్న భూమిని బి-కేటగిరీగా.. ఏ, బీ కేటగిరీకి ఆనుకుని వరదలొస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సీ-కేటగిరీగా విభజించారు. ఎ-కేటగిరీలో 475.93 ఎకరాలను 1,178 మందికి.. బి-కేటగిరీలో 848.22 ఎకరాలను 2,333 మందికి.. సి-కేటగిరీలో 7,738.25 ఎకరాలను 15,665 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు అసైన్‌మెంట్ కమిటీలు ఆమోదం కూడా తెలిపాయి.

గ్లోబల్ టూరిజం మ్యాపులో గండికోట

- సెవెన్ స్టార్ హోటల్ ఒబెరాయ్‌కి శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ సీఎం జగన్
- విశాఖ, తిరుపతిలో కూడా ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, కడప: గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిల్చుకునే మన గండికోటను ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోటలో ఆదివారం ఆయన ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుపతి, విశాఖపట్నం ఒబెరాయ్ హోటల్స్‌కు కూడా వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. ఒక్క రోజే గండికోట, విశాఖపట్నం, తిరుపతితో కలిపి మూడు చోట్ల ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు జరగడం సంతోషకరం అని చెప్పారు. ఒబెరాయ్ లాంటి గ్రూపు ఇక్కడకు వచ్చి.. సూపర్ లగ్జరీ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఇలాంటి పెద్ద పెద్ద గ్రూపులు వచ్చి ఇలాంటి హోటల్స్ కడితే గండికోట గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి చేరుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల వైఎస్సార్ జిల్లా, గండికోట రెండూ అంతర్జాతీయంగా చోటు దక్కించుకుంటున్నాయని అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగావకాశాలు విస్తృతం

- ఈ హోటల్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 500 నుంచి 800 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒబెరాయ్ ప్రాజెక్టు అనేది మిగిలిన ప్రాజెక్టులు రావడానికి ఒక దిక్సూచిగా ఉపయోగపడుతుంది. గండికోటలో ఇలాంటి గ్రూపు ప్రాజెక్టులు రావడానికి ఇంకా అవకాశం ఉంది. ఒబరాయ్ లాంటి ఇంకో గ్రూపుని తీసుకొచ్చే కార్యక్రమం ముమ్మరంగా చేస్తాం.



సెవెన్ స్టార్ హోటల్ ఒబెరాయ్‌కి శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో విక్రమ్ ఒబెరాయ్

- ఇంతకుముందు విక్రమ్ ఒబెరాయ్‌తో మాట్లాడుతూ ఇక్కడ గోల్ఫ్ కోర్ట్ పెట్టే ఆలోచన చేస్తే హోటల్‌కు మంచిదని, ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయని.. ఈ హోటల్‌ను ఒక గోల్ఫ్ రిసార్ట్‌గా దేశానికి, ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాలు ఉంటాయని చెప్పాను. ఆ దిశగా అడుగులు వేసేలా ఆలోచన చేస్తామన్నారు.
- జమ్మలమడుగు నియోజకవర్గంలో స్టీల్ ఫ్యాక్టరీ రావాలని కలలు కన్నాం. మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు రావాలని దశాబ్దాలుగా కన్న కలను నిజం చేస్తూ గతేడాది జిందాల్ గ్రూపుతో కలిసి ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇందుకు సంబంధించిన వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు ఈ నెలలోనే ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ వస్తుంది. ఆ తర్వాత రెట్టించిన వేగంతో పనులు జరుగుతాయి.
- రేపు కొప్పర్తిలో డిక్సన్ కంపెనీకి సంబంధించిన ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేస్తున్నాం. కొప్పర్తిలో డిక్సన్ గ్రూపు 1000కి పైగా ఉద్యోగాలు ఇచ్చింది. మరో రెండు నెలల్లో ఇంకో 1000 ఉద్యోగాలు రాబోతున్నాయి. చానల్ ప్లే అనే మరో కంపెనీ హోం ఆడియో సిస్టమ్స్ తయారు చేస్తుంది. రేపు కొప్పర్తిలో ఆ కంపెనీతో ఎంఓయూపై సంతకాలు చేయనున్నాం. ఈ కంపెనీ ద్వారా 150 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.
- ఎల్‌ఈడీ టీవీలు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారు చేసే టెక్నో డామ్ ఇండియా అనే మరో కంపెనీతో కూడా రేపు ఎంఓయూ చేయబోతున్నాం. ఈ కంపెనీ ద్వారా మరో 200 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

> ప్రస్తుతం దేశంలో పర్యాటకం కీ రోల్ పోషిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఒక దార్శనికతతో తన డైనమిక్ లీడర్‌షిప్‌తో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. ఇందులో మమ్మల్ని భాగస్వాములను చేస్తున్నందుకు కృతజ్ఞతలు. ప్రపంచ స్థాయి సెవెన్ స్టార్ రిసార్ట్స్‌ను, మంచి రూమ్స్, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేస్తాం. ఏపీలో హోటల్స్ స్థాపించడం వల్ల ఇక్కడి వారికి ఉపాధి ఇవ్వగలుగుతాం. ప్రఖ్యాతిగాంచిన ఈ గండికోటలో మంచి సౌకర్యాలతో లగ్జరీ సెవెన్ స్టార్ రిసార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి, వైజాగ్‌లో కూడా హోటల్స్‌ను ప్రారంభిస్తాం. 2025కు ఈ హోటల్స్ ప్రారంభమవుతాయి.
> – విక్రమ్‌సింగ్ ఒబెరాయ్, ఒబెరాయ్ హోటల్స్ సీఈవో

'తానా'లో బాహాబాహి

- 'జై ఎన్టీఆర్' నినాదాల కలకలం
- తన్నుకున్న లోకేశ్, జూ.ఎన్టీఆర్ వర్గాలు
- చొక్కాలు పట్టుకుని.. కర్రలు విసురుకుంటూ

పెన్సిల్వేనియా(అమెరికా): అమెరికాలో 'తానా'(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) సభల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్ వర్గాలు పరస్పరం తన్నుకున్నాయి. రెండుగా చీలిపోయిన టీడీపీ ఎన్నారై సభ్యులు పిడిగుద్దులు గుద్దుకున్నారు. తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాలు పరస్పరం చొక్కాలు పట్టుకుని మరీ దాడులకు దిగాయి. టీడీపీ ఎన్నారై అధ్యక్షుడు కోమటి జయరాం సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. ఈ ఘర్షణకు ప్రధాన కారణం లోకేష్ నాయకత్వంపై వ్యక్తమైన విమర్శలే కారణమని తెలుస్తోంది. ఈ సమావేశాల సందర్భంగా కొందరు తెలుగు తమ్ముళ్లు 'జై ఎన్టీఆర్'అని నినదించడంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు వర్గం దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. పార్టీ పగ్గాలు చంద్రబాబు చేతిలో ఉన్నంతవరకు టీడీపీకి మనుగడ లేదని, 2024లోనూ మరోసారి పరాజయం ఖాయమని కొందరు వాదించినట్లు సమాచారం. తనను తాను మూర్ఖుడిగా చెప్పుకునే లోకేష్‌కు బదులుగా జూనియర్ ఎన్టీఆర్‌కు పార్టీ పగ్గాలను అప్పగించాలని ఓ వర్గం డిమాండ్ చేసింది. దీంతో కలవరం చెందిన చంద్రబాబు వర్గం దాడులకు దిగినట్లు తెలిసింది. అమెరికాలో సుదీర్ఘ చరిత్ర కలిగిన తానాకు ఈ ఘటన మాయని మచ్చలా మిగిలింది.

కర్రలు విసురుకుంటూ..

పెన్సిల్వేనియాలో తానా 23వ మహాసభలను ఘనంగా ప్రారంభించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రిటైర్డ్ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తదితరులు ఈ వేడుకలను ప్రారంభించారు. తొలిరోజు బాంకెట్ డిన్నర్ ముగిసిన అనంతరం తానాలోని కొందరు ప్రముఖులు కన్వెన్షన్ సమీపంలోని హాలులో కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీకి సంబంధించిన అంశాలపై తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాల మధ్య వివాదం రేగడంతో ముష్టియుద్ధానికి దిగాయి. వివాదం శృతి మించడంతో కొందరు అందుబాటులో ఉన్న కర్రలను విసిరారు. ప్రతిష్టాత్మక తానా సంస్థను రాజకీయ సంస్థగా మార్చిన ఘనత చంద్రబాబుదేననే విమర్శలున్నాయి. నిధుల సేకరణ కోసం తానాను ఆయన కామధేనువులా మార్చుకున్నారు.



దేశంలో బీసీలను ఆదరిస్తున్న ఏకైక సీఎం జగనే..

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

నరసరావుపేట: దేశంలో బీసీలకు అధికారం కల్పించి వారిని ఆదరిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీతో పాటు ఎన్నో రాష్ట్రాలకు బీసీలు సీఎంలుగా ఉన్నా వారు బీసీలకు చేయలేని మేలు సీఎం జగన్ ఏపీలో చేశారని కొనియాడారు. నరసరావుపేట టౌన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన పల్నాడు బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ అడక్కుండానే బీసీలకు అన్నీ ఇస్తున్నారని ప్రశంసించారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఛతీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో పర్యటిస్తే సీఎం జగన్ విలువ తెలుస్తుందన్నారు. కర్ణాటకలో సిద్దరామయ్య, తమిళనాడులో స్టాలిన్, చతీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీసీలే సీఎంలు, మంత్రులుగా ఉన్నా అక్కడ అమ్మ ఒడి లేదన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ తిరిగానని, పశ్చిమబెంగాల్లో గురుకులాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి వంటి పథకాలు లేవని చెప్పారు. బీసీ కులాల పిల్లలు అడుక్కు తినే స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛతీస్‌ఘడ్‌లో హాస్టళ్లు, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు లేవని, బీసీ వర్గీయులు అందరూ కూలి పని, భిక్షాటన చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో బీసీ కులాలను చదవనీయకుండా కుట్ర జరుగుతోందని, ఇక్కడ సీఎం జగన్ మాత్రం బీసీలు చదువుకుంటేనే గొప్పవారవుతారని, పేదరికం తగ్గుతుందని వారికోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు.



శ్రీకాళహస్తిలో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొట్టిన కారు
- ఆరుగురు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లారీని ఓవర్‌టేక్ చేసిన కారు ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ దుర్ఘటనలో విజయవాడకు చెందిన ఆరుగురు మృత్యువాతపడగా.. ఓ యువకుడు తీవ్రగాయాలతో మిట్టకండ్రిగ వద్ద ఆస్పత్రి పాలయ్యాడు. సీఐ అంజు యాదవ్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకలోని బాలాజీ టవర్స్ 304 ప్లాట్‌లో ఉంటున్న తుంగల రమేష్‌బాబు, ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారుడు భరత్(ఇంటర్), విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉంటున్న రాజ్యలక్ష్మి అక్క శ్రీలత(42), కృష్ణలంక ప్రాంతంలోని బాలాజీనగర్ పోలీస్ కాలనీలో ఉంటున్న రాజ్యలక్ష్మి స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్ష్య(17)లు కారులో శుక్రవారం రాత్రి తిరుమలకు బయలుదేరారు. శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం వేకువజామున తిరుగుపయనమయ్యారు. శ్రీకాళహస్తి రెండు కిలోమీటర్ల దూరం ఉందనగా.. మిట్టకండ్రిగ వద్ద రమేష్‌బాబు నడుపుతున్న కారు ఓ లారీని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న మరో లారీని వేగంగా ఢీకొట్టింది. కారు నడుపుతున్న తుంగల రమేష్‌బాబు, భార్య రాజ్యలక్ష్మి(40), ఆమె అక్క శ్రీలత(42), స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్ష్య(17) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న తుంగల భరత్ ఒక్కడే తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలను కారులోంచి బయటకు తీసేందుకు రెండు గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. డ్రైవింగ్ చేస్తున్న రమేష్ మృతదేహం ఎంతకీ రాకపోవడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించి ఆపై కట్టర్లతో కారు డోరును కత్తిరించాల్సి వచ్చింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



శ్రీకాళహస్తి వద్ద ఢీకొన్న కారు, లారీ


జోగుళాంబ ఆలయంలో ప్రముఖుల పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ పుణ్యక్షేత్రాన్ని ఆదివారం హెచ్‌ఎండీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. ఉభయ ఆలయల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ముఖ్య అర్చకులు ఆనంద్ శర్మ క్షేత్ర ప్రాశస్త్యం తెలియజేసి తీర్థ, ప్రసాదాలు అందించారు. అదే విధంగా రాష్ట్ర దేవదాయశాఖ సూపరింటెండెంట్ భాస్కర్, ఫస్ట్ గ్రేడ్ ఈవో శ్రీనివాస్‌శర్మ కూడా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన సదుపాయం కల్పించారు.

ముస్లిం జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడిగా ఫారుఖ్

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన ముస్లిం జేఏసీ కోర్ కమిటీలో జిల్లాకేంద్రానికి చెందిన షేక్ ఫారుఖ్ హుస్సేన్ చోటు దక్కింది. హైదరాబాద్‌లో ఆదివారం ప్రకటించిన ముస్లిం డిక్లరేషన్ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 8 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోగా వారిలో ఫారుఖ్ హుస్సేన్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.. అందరి సహకారంతో త్వరలో ఉమ్మడి జిల్లా ముస్లింల సమావేశం నిర్వహించి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను ముస్లింల వద్దకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

మహిళా డాక్టర్ మౌనపోరాటం



వనపర్తి: కొన్ని నెలలుగా భర్త, కుటుంబ సభ్యులతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా తనకు న్యాయం చేయాలని ఓ మహిళా డాక్టర్ జిల్లా కేంద్రంలో ఆదివారం మౌనపోరాటం చేపట్టింది. తన సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానంటూ క్లినిక్ మూసి మెట్లపై దీక్ష చేపట్టింది. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. భర్తతో వచ్చిన మనస్పర్థల వల్ల తనకు న్యాయం చేయాలని ఓ మహిళా డాక్టర్ దీనంగా రోడ్డుపక్కన కూర్చోవటంతో దారిన వచ్చిపోయేవారు ఈ విషయాన్ని చర్చించుకోవడం కనిపించింది.

కాగితాల్లోనే మినీ బస్‌డిపో

- జడ్చర్లలో ఏర్పాటుపై ముందుకు పడని అడుగు
- 1994లో ప్రతిపాదనలు
- పారిశ్రామిక సెజ్ ఏర్పాటుతో స్థానికంగా పెరిగిన రద్దీ
- వారాంతం, పండుగ రోజుల్లో సీట్లు దొరక్క ఇబ్బందులు

జడ్చర్ల టౌన్: జడ్చర్లలో మినీ బస్‌డిపో ఏర్పాటుపై ఏళ్లుగా సందిగ్ధం నెలకొంది. రెండు జాతీయ రహదారులకు కేంద్రంగా ఉండటంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇక్కడ అవసరం ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జడ్చర్లలో బస్‌డిపో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు దశాబ్దాల క్రితమే ఉన్నాయి. అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో 1994లో ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రసత్యం ఇక్కడి ప్రజల కోరిక మేరకు మినీ బస్‌డిపో ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. అందుకోసం అవసరమైన స్థల సేకరణ చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్న క్రమంలోనే 1995లో ఆయన హత్యకు గురికావటంతో ఆ ప్రతిపాదనలు అక్కడితో నిలిచిపోయాయి. ఆ తరువాత గెలిచిన ఎమ్మెల్యేలు హామీ ఇచ్చినప్పటికీ ఎవరూ నెరవేర్చలేకపోయారు.

డిపో ఆవశ్యకత..

ఆర్టీసి అధికారులు చెబుతున్నట్లుగా సమీపంలోనే డిపోలు ఉన్నప్పటికీ ఈప్రాంత వాసులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయాయి. జడ్చర్ల మీదుగా 44వ, 167వ నంబర్ రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. మరోవైపు పోలేపల్లి ఫార్మా సెజ్ ఏర్పాటుతో వేలాదిమంది ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన చాలామంది ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అలాగే నిత్యం జడ్చర్ల, సమీప గ్రామాలు, పట్టణాల నుంచి వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర పనులపై పెద్దసంఖ్యలో హైదరాబాద్ వెళ్లి వస్తుంటారు.



జడ్చర్లలోని కొత్త బస్టాండ్

ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులు ప్రయాణికులు నిండిన తర్వాతే వస్తున్నాయి. దీంతో జడ్చర్ల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారికి చాలా సార్లు సీట్లు దొరకక ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా సోమవారం, పర్వదినాలు, పండగలు ముగిసిన తర్వాత బస్సుల్లో సీట్లు లేక హైదరాబాద్ వరకు నిల్చునే వెళ్లాల్సి వస్తుంది. పిల్లాపాపలతో వెళ్లేవారి అవస్థలు వర్ణనాతీతం. బస్‌డిపో ఏర్పాటు చేస్తే ఇక్కడి నుంచే బస్సులు బయలుదేరటం వల్ల ప్రయాణికులకు నిలబడి వెళ్లే సమస్య తీరుతుంది. గతంలో షాద్‌నగర్ నుంచి బాదేపల్లి పాతబస్టాండ్ వరకు షటిల్ బస్సులు నడిచేవి. ప్రస్తుతం వాటిని రద్దుచేశారు. ఆయా డిపోల నుంచి బస్సులను వారి ఇష్టానుసారంగా నడిపిస్తుండటంతో ఇబ్బందులు తప్పటంలేదు. కల్వకుర్తి నుంచి జడ్చర్ల, మహబూబ్‌నగర్ రావాలంటే రాత్రి 8.30గంటల తరువాత బస్సు సౌకర్యం లేదు. డిపో ఉన్నట్లయితే అవసరమైన సమయాల్లో బస్సులు నడిపేందుకు అవకాశాలు ఏర్పడతాయి. గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సులు రద్దయ్యాయి. గతంలో వనపర్తి డిపో నుంచి ఖిల్లాఘనపూర్, మొల్గర మీదుగా ఆలూరు నుంచి బాదేపల్లి బస్టాండ్ ద్వారా హైదరాబాద్‌కు బస్సులు రాకపోకలు సాగించేవి. బాదేపల్లి నుంచి గంగాపురం, కోడ్గల్, పెద్దఆదిరాల, తొమ్మిదిరేకుల గ్రామం మీదుగా కేశంపేట, మాల్ గ్రామం వరకు బస్సులు నడిపేవారు. రాత్రిళ్లు కొన్ని బస్సులు బాదేపల్లి బస్టాండ్‌లో నిలిపి తెల్లవారుజామున వెళ్లేవి. ఈ బస్సు సర్వీసులు ఇతర డిపోలవి కావటంతో రద్దు చేశారు. ఫలితంగా ఆ రూట్లతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. స్థానికంగా డిపో ఏర్పాటుతో ఈ సమస్య తీరనుంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే వారికి బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసి అధికారులు మినీ డిపో ఏర్పాటు చేయాలని ప్రయానికులు, ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **ప్రతిపాదనలు లేవు..**
> జడ్చర్లలో మినీ బస్‌డిపో ప్రతిపాదనలు లేవు. మహబూబ్‌నగర్ డిపో 16కిలోమీటర్లు, కల్వకుర్తి డిపో 39, షాద్‌నగర్ డిపో 38, నాగర్‌కర్నూలు డిపో 40 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. దీనివల్ల ఇక్కడ డిపో ఏర్పాటు సాధ్యపడదు. అయితే బస్సుల సమస్య తీర్చేందుకు పండగలు, ప్రత్యేక దినాల్లో జడ్చర్ల బస్టాండ్ నుంచి కొన్ని బస్సులు నడిపేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.
> – సుజాత, డివిజనల్ మేనేజర్, మహబూబ్‌నగర్ డిపో

విత్తనపత్తి రైతులను ఆదుకోవాలి

గద్వాల అర్బన్: సుంకు రాక నష్టపోయిన విత్తనపత్తి రైతులను విత్తన కంపెనీలు ఆదుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కాకులారంలో పత్తి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో 90ఎకరాలకు పైగా వివిధ కంపెనీలకు సంబంధించి విత్తన పత్తిని సాగు చేస్తున్నారని తెలిపారు. క్రాసింగ్ సమయం దాటినా ఇప్పటి వరకు సుంకు రాక, ఎర్రతెగులు వచ్చి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను కంపెనీలు ఆదుకునే దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను కంపెనీలు ఆదుకోకపోతే నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, లవన్న, తిమ్మప్ప, బలరాం, వెంకట్రాములు, జగదీష్ తదితరులు ఉన్నారు. ఇదిలాఉండగా, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని స్థానిక కార్యాలయంలో ఆ సమితి చైర్మన్ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో గద్వాల మండలం మదనపల్లి గ్రామానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భీసన్న, అధ్యక్షుడు మొగిలన్న, ఉపాధ్యక్షులు పెద్ద ఎల్లప్ప, శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా సు సుంకన్న, రామకృష్ణ, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు దాసన్న, రాజన్న, పరుశరాముడు, రమేష్, జనార్ధన్, ఈశ్వర్ ఉన్నారు.



కాకులారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న రంజిత్‌కుమార్

టూరిజం గైడ్‌కు నోటీసులు జారీ

సాక్షి ఎఫెక్ట్..

జోగుళాంబ శక్తిపీఠం: 'జోగుళాంబ సన్నిధిలో నకిలీల హవా..!' అంటూ ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై దేవాదాయశాఖ అధికారులు స్పందించారు. ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు ఉద్యోగులుగా ఎలా చలామణి అవుతున్నారని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ జోగుళాంబ ఆలయ ఈవో పురేందర్‌కుమార్‌ను అడిగారు. సాక్షి పత్రికలో వచ్చిన కథనం, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను ఆలయ ఈవోకు ఫార్వర్డ్ చేసి వివరణ కోరారు. వెంటనే ఆలయ ఈవో దేవస్థానం సిబ్బందిని పిలిపించి విచారించారు. టూరిజం తరుపున దేవస్థానం పరిసరాల్లో గైడ్‌గా పని చేస్తున్న రామ్మోహన్ భక్తులను టికెట్లు లేకుండా వీఐపీ దర్శనాలు చేయిస్తున్నారని, ఆలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఈవోకు వివరించారు. దీనిపై వివరణ కోరుతూ సంబంధిత టూరిజం సైట్ గైడ్‌కు అధికారులు నోటీసులు జారీ చేశారు. 24 గంటలలోపు సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో టూరిజం శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి క్రమశిక్షణ చర్యల తీసుకుంటామని పేర్కొన్నారు. దేవస్థానంలో పని చేసే ఉద్యోగులు వారే విధుల్లో ఉండాలని, వేరే వాళ్లను విధులకు పంపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో పేర్కొన్నారు.


శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానములు
NOTICE

టూరిజం సైట్ గైడ్‌కు నోటీసులు

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్



హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ విన్నర్ భూత్పూర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న బాల శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం మొదటి మహబూబ్‌నగర్ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. ఈ లీగ్‌లో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, ధన్వాడ, గండేడ్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, బాలానగర్, భూత్పూర్ మండలాల జట్లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు లీగ్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో భూత్పూర్ జట్టు 10- 9 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మంచి ఆరోగ్యం కోసం క్రీడల్లో పాల్గొనాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఏకాగ్రత, క్రమశిక్షణతో ఆడాలని, నిరంతరం క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంత, బాలకృష్ణ, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ తఖీయొద్దీన్, మహ్మద్ జియావుద్దీన్, ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, అబ్దుల్ కలీం, నసీరుద్దీన్, కోశాధికారి ముహిబుర్ రహెమాన్, కార్యనిర్వాహక కార్యదరిశ అహ్మద్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శులు ఉబేదుర్ రబ్, అబ్దుల్ ఘని, కోచ్‌లు ప్రదీప్‌కుమార్, నర్సింహులు, రాంమోహన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.